సాక్షి
ఖమ్మం
బుధవారం। 29। నవంబర్। 2023



అక్కడ ఎలా ఉంది?!

విదేశాల్లో నివసిస్తున్న జిల్లావాసులు ఇక్కడ ఎన్నికల ప్రచార శైలి, పార్టీల బలాబలాలను ఆసక్తిగా ఆరా తీస్తున్నారు. 2లో



ముక్కోటి ఏర్పాట్లు ప్రారంభం

భద్రాచల పుణ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. 2లో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలిగాలుల తీవ్రత పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

మూతపడిన మద్యం దుకాణాలు



వైన్స్‌ను సీజ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఖమ్మంక్రైం: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నందున జిల్లాలోని 122 వైన్స్, బార్లను మంగళవారం సాయంత్రం మూసివేశారు. మళ్లీ పోలింగ్ ముగిశాక గురువారం సాయంత్రం షాపులు తెరుచుకుంటాయి. ఈ మధ్యలో ఎవరైనా వైన్స్, బార్లను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో హెచ్చరించారు.

కవి సమ్మేళనానికి పేర్లు నమోదు చేసుకోవాలి

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ తెలుగు మహాసభల సందర్భంగా నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనేందుకు రచయితలు, కవులు గురువారంలోగా పేర్లు నమోదు చేసుకోవాలని మహాసభల నిర్వాహకులు, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. జనవరి 5, 6, 7వ తేదీల్లో రాజమండ్రిలోని గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో తెలుగు మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈనేపథ్యాన నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనే వారు తమ పేర్లను 92472 72066, 99897 23989 నంబర్లను సంప్రదించి నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

సూక్ష్మ పరిశీలకులే కీలకం

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల్లో మైక్రోఅబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు తుషార్ కాంత మహంతి, సత్యేంద్ర సింగ్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం మైక్రో అబ్జర్వర్లకు ఏర్పాటుచేసిన శిక్షణలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మపరిశీలకులు కళ్లు, చెవుల మాదిరి విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా సమన్వయంతో పనిచేస్తే ఎన్నికలు సాఫీగా ముగుస్తాయని తెలిపారు. జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు కె.శ్రీరామ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మదన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంతా గప్‌చుప్!

ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

- కొద్దిరోజుల క్రితమే అగ్రనేతల రోడ్‌షోలు, సభలు పూర్తి
- చివరి రోజు నియోజకవర్గాల్లో ప్రచారాన్ని హోరెత్తించిన అన్ని పార్టీలు
- బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారంతో జిల్లావ్యాప్తంగా సందడి
- మిగిలిన కొద్ది సమయంలో పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీల నజర్

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ 30వ తేదీన జరగనుండగా.. ప్రధాన ఘట్టమైన ప్రచారం మంగళవారం ముగిసింది. గత 25 రోజులుగా హోరాహోరీగా సాగిన ప్రచారానికి తెరపడింది. ఎడతెరిపి లేకుండా మోగిన మైకులు మూగపోయాయి. జిల్లాలోని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎం అభ్యర్థులు పోటీ పడుతుండగా... పార్టీల అగ్రనేతలు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొనగా.. ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ ఒకేరోజు జిల్లాలో సుడిగాలి ప్రచారం నిర్వహించారు. ఇక చివరి రోజైన మంగళవారం అభ్యర్థులు బైక్‌ర్యాలీలు, ఇంటింటి ప్రచారంతో బలప్రదర్శన ద్వారా ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఇదేసమయాన పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



మోత మోగింది..

ఈనెల 3నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను ముందుగానే ప్రకటించడంతో ఆత్మీయ సమ్మేళనాలతో ప్రచారాన్ని షురూ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులను విడతల వారీగా ప్రకటించగా, ఈనెల 10వ తేదీ తర్వాతే ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులు ప్రత్యేక వాహనాలకు పార్టీ మేనిఫెస్టో, గుర్తులు ఏర్పాటుచేయడమే కాక మైక్‌లు బిగించి పాటలతో హోరెత్తించారు. ఇంటింటికీ కరపత్రాలు, మేనిఫెస్టోలు, గ్యారంటీ కార్డులు పంచారు. కార్యకర్తలు, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నేతలు అందరి ఇళ్లకు వెళ్తూ తమ అభ్యర్థికే ఓటు వేయాలని అభ్యర్థించారు.

రంగంలోకి కేసీఆర్

బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. అక్టోబర్ 27న తొలిసారిగా జిల్లాలోని పాలేరు నియోజకవర్గం నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత సత్తుపల్లి, ఖమ్మం, మధిర, వైరాల్లో నిర్వహించిన సభలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై విమర్శల బాణాలు సంధించారు. అలాగే, మంత్రి మహమూద్ అలీ ఖమ్మంలో ప్రచారానికి హాజరయ్యారు. మరోపక్క ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి కూడా ప్రచారంలో పాల్గొని బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

ప్రియాంక సుడిగాలి ప్రచారం

కాంగ్రెస్ అభ్యర్థుల పక్షాన ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ సుడిగాలి ప్రచారం నిర్వహించారు. ఈనెల 25న ఆమె ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొన్నారు. మధిరలో ఏర్పాటు చేసిన విజయభేరి సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా హాజరుకాగా.. ప్రియాంకగాంధీ ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. మరోవైపు అభ్యర్థులు సైతం నియోజకవర్గాల్లో ముమ్మర ప్రచారం చేశారు. మధిర, పాలేరు నుంచి బరిలో ఉన్న సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమ నియోజకవర్గాల్లో ప్రచారం చేయడమే కాక మిగతా చోట్ల కూడా అభ్యర్థుల తరఫున ప్రచారానికి హాజరయ్యారు.

మిగతా అభ్యర్థులు కూడా..

జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తోపాటు బీజేపీ, జనసేన, బీఎస్పీ తదితర పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరంతా ప్రచారాన్ని ఉరకలెత్తించారు. ఈసారి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేశారు. వాయిస్ రికార్డులతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఓట్లు రాబట్టడంపై దృష్టి

ప్రచారం పరిసమాప్తి కావడంతో అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలవడంలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గాల్లో బలమైన ప్రాంతాలను గుర్తించి అక్కడి ఓట్లు వేయించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే, బలహీనమైన ప్రాంతాల్లో ఓటర్లను మరింతగా ఆకట్టుకునే వ్యూహాలను రచిస్తున్నారు. పోలింగ్ రోజున ఏజెంట్ల నియామకం, అత్యధికంగా తమకు ఓట్లు పడేలా అనుసరించాల్సిన వ్యూహాలపై అభ్యర్థులు అనుచరులతో చర్చలు సాగిస్తున్నారు. పోలింగ్ గురువారం జరగనుండగా.. మధ్యలో బుధవారాన్ని పూర్తిగా ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై నజర్ పెట్టారు. చాలాచోట్ల ఓటుకు నోటు ఇస్తున్నా ఓటర్ల అంతరంగం అంతు చిక్కకపోవడంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. దీంతో నోట్ల పంపిణీ ఎలా సాగుతోంది, ఇంకా ఎక్కడెక్కడ పంపిణీ చేయాల్సి ఉందనే అంశంపై ఆరాతీస్తూ రహస్యంగా నగదు చేరవేస్తున్నారు.

ఖమ్మం బీఆర్‌ఎస్‌కు కంచుకోట



ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

- జిల్లాలో అత్యధిక స్థానాలు గెలుచుకుంటాం
- నాపై ప్రత్యర్థులది గోబెల్స్ ప్రచారం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ కంచుకోట అని, బలమైన కేడర్ కలిగిన నేపథ్యాన ఈ ఎన్నికల్లో జిల్లాలోని అత్యధిక స్థానాలు గెలుచుకోనున్నామని ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ప్రచారానికి చివరిరోజైన మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఖమ్మంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పెవిలియన్ గ్రౌండ్ వద్ద మొదలై పలు ప్రాంతాల మీదుగా మమత ఆస్పత్రికి చేరుకుంది. ఈ ర్యాలీలో పాల్గొన్న పువ్వాడ మాట్లాడుతూ కారు గుర్తుపై ఓటు వేసి మరోమారు తనను గెలిపించాలని కోరారు. ఇన్నాళ్లు శ్రేణులు ప్రచారంలో సత్తా చాటారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే జిల్లాలో అత్యధిక స్థానాల్లో గెలవడం, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయంగా కనిపిస్తోందని తెలిపారు. 2018లో కొంత ప్రతికూల ఫలితాలు వచ్చినా ఆ తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించిందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ జిల్లాలో బలమైన పార్టీగా ఉన్న నేపథ్యాన ప్రజలు తనను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాగా, ప్రత్యర్థులు అవాస్తవ ప్రచారం చేస్తున్నందున ప్రజలు తిప్పికొట్టాలని పువ్వాడ పిలుపునిచ్చారు. ఖమ్మంలో అభివృద్ధి కొనసాగాలంటే మరోమారు తనను గెలిపించాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత, ఎన్నికల సమన్వయకర్త గుండాల కృష్ణ, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు జహీర్ అలీ, పల్లా రాజశేఖర్, అమరగాని వెంకన్న, చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, గిరి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన ఎంపీ నామ, తదితరులు

జంగ్ తెలంగాణ

పదికి పది గెలుస్తాం..



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన సీపీఐ నేత నారాయణ తదితరులు

- పాలేరులో పోలీసులు మా వాళ్లను ఇబ్బంది పెట్టారు
- కొత్తగూడెంలో కూనంనేనికి 25వేల మెజార్టీ రానుంది
- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గతంలో చెప్పినట్టుగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది స్థానాలు గెలుస్తున్నామని.. తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు మంచి మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలోని సాయిగణేష్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణతో కలిసి మాట్లాడారు. పాలేరులో తనను ఓడించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శక్తినంతా వాడారని, పోలీస్ వ్యవస్థతో ప్రజలు, పార్టీ శ్రేణులు, నేతలను ఇబ్బందులు పెట్టించారని ఆరోపించారు. అయినా పాలేరు ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచించి ప్రజల మనిషిగా తనకే పట్టం కట్టబోతున్నారని చెప్పారు. పాలేరు ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వంలో అసెంబ్లీలో కూర్చోనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగూడెంలో కాంగ్రెస్ మద్దతుతో బరిలో నిలిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు 22 వేల నుంచి 25 వేల మెజార్టీతో గెలవబోతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలు డబ్బుల వరద పారించి చేసే జిమ్మిక్కులను ప్రజలు నమ్మకపోగా, కాంగ్రెస్ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారని వెల్లడించారు. తద్వారా బ్రహ్మాండమైన మెజార్టీతో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఆపై కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు పరిమితం కాక తప్పదని తెలిపారు. కాగా, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి కేబినెట్‌లోనే నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. ఉచిత కరెంట్, రైతుల పక్షపాతి అంటే కాంగ్రెస్ పేటెంట్ అని.. కానీ కేసీఆర్ ఉచిత కరెంట్ కాంగ్రెస్ ఇవ్వొద్దని చెప్పిందంటూ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ కేసీఆర్ నిజస్వరూపాన్ని బయటపెట్టిన డాక్టర్ గోపీనాథ్‌తోపాటు మరికొందరిపై కేసులు పెట్టడం కక్షసాధింపు చర్యేనని తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్, దేశంలో మోదీ ప్రజాస్వామ్య, వామపక్షవాదులపై కేసులు పెట్టి వేధించారని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాదరెడ్డి, రాయల నాగేశ్వరరావు, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బేబి స్వర్ణకుమారి, మద్ది శ్రీనివాసరెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, సీపీఐ, టీడీపీ నాయకులు మౌలానా, కూరపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్



కౌంటింగ్ కేంద్రంలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు, ఇతర అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమన్వయంతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. నిబంధనలను ఎవరు కూడా అతిక్రమించకుండా పర్యవేక్షించాలని, డబ్బు, మద్యం పంపిణీని కట్టడి చేయాలని చెప్పారు. అలాగే, నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసి ఉద్యోగులు ఇబ్బంది పడకుండా చూడాలని తెలిపారు. అనంతరం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ నిఘా బృందాలు అక్రమ మద్యం అమ్మకాలపై నిఘా వేయాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మూడో దశ ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లాలో పోలింగ్ సిబ్బంది మూడో దశ ర్యాండమైజేషన్ పూర్తయింది. కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు తుషార్ కాంత మహంతి, కానారామ్, సత్యేంద్రసింగ్, రిటర్నింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ గౌతమ్ ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియ చేపట్టారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డి.మధుసూదన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లెక్కింపు కేంద్రాన్ని సిద్ధం చేయండి

ఖమ్మంరూరల్: వచ్చేనెల 3న తేదీన ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్లు లెక్కించనున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం పరిశీలించిన కలెక్టర్ ఏర్పాట్లపై ఆరా తీశారు. పోలింగ్ ముగిశాక అధికారులు తీసుకొచ్చే ఈవీఎంలు భద్రపరిచేందుకు ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూంలు, పోలింగ్ రోజున ఏర్పాటుచేయనున్న టేబుళ్లు, వచ్చివెళ్లే మార్గాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, అధికారులు సుమ, రాజేశ్వరి, బస్వారెడ్డి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ ఇక్కడే...



వైరా డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన టెంట్లు

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. విధులు నిర్వర్తించే అధికారులు బుధవారమే సామగ్రి తీసుకుని కేంద్రాలకు వెళ్లనున్నారు. ఇందుకోసం నియోజకవర్గ కేంద్రాల్లో అధికారులు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి గుట్టలబజార్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో, పాలేరు నియోజకవర్గ ఉద్యోగులకు ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య కాలేజీలో, మధిర నియోజకవర్గానికి సంబంధించి ఖాజీపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటుచేశారు. ఇక వైరా నియోజకవర్గ ఉద్యోగులకు స్థానిక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో, సత్తుపల్లి ఉద్యోగులకు జ్యోతినిలయం హైస్కూల్‌లో సామగ్రి పంపిణీ చేయనున్నారు.

కథ కంచికి.. మనం ఇంటికి !

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. ఇన్నాళ్లు మోతమోగిన మైకులను వాహనాల నుంచి నిర్వాహకులు విడదీసి తమ షాపులకు తీసుకెళ్లారు. అలాగే, వాహనాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లు తొలగించడంలో యజమానులు నిమగ్నమయ్యారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


కాంగ్రెస్ ప్రచార వాహనం ఫ్లెక్సీ తొలగిస్తున్న దృశ్యం


వ్యాన్‌పై బీఆర్‌ఎస్ ఫ్లెక్సీని తొలగిస్తూ...


జీపుపై స్టిక్కర్లు తొలగిస్తున్న సీపీఎం కార్యకర్త


వాహనాల నుంచి తీసిన మైక్‌లు, బ్యాటరీలు

క్లుప్తంగా

ముక్కోటి ఏర్పాట్లు ప్రారంభం


ఆలయం ఎదుట చలువపందిళ్లు వేస్తున్న కూలీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో డిసెంబర్ 13 నుంచి జనవరి 2 వరకు నిర్వహించే వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలకు చేపట్టే ఏర్పాట్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ద్వారాలకు రంగులు వేయడం, విద్యుత్ దీపాలంకరణ, ఆలయం చుట్టూ చలువ పందిళ్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

1 నుంచి పునర్వసు దీక్ష

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో వచ్చేనెల 1న కార్తీక మాస పునర్వసు నక్షత్రం రోజున శ్రీరామ పునర్వసు దీక్ష ప్రారంభమై 28వ తేదీన ముగుస్తుందని ఈఓ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అదేరోజు గిరి ప్రదక్షిణ, పాదుకాపూజ, దీక్షా విరమణ ఉంటాయని, రాత్రి 7 గంటలకు వెండి రథోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం వైద్యవిభాగం: ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం హెచ్ఐవీ బాధితులకు ముగ్గుల పోటీలు, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఏఆర్‌టీ సెంటర్ అధికారులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కాగా, పోటీల్లో విజేతలకు డిసెంబర్ 1న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

రూ.2లక్షల విలువైన మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో అధికారులు

కల్లూరు రూరల్: ఎన్నికల వేళ అక్రమంగా నిల్వ చేసిన మద్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కల్లూరులోని కప్పల బంధం రోడ్డులో ఉన్న బెల్ట్‌షాపులో మద్యం నిల్వ చేశారన్న సమాచారంతో అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.2లక్షల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఫ్లయింగ్ స్కాడ్ అధికారి, ఎంపీడీఓ బి.రవికుమార్, ఎక్సైజ్ ఎస్సై అల్లూరి సీతారామరాజు తెలిపారు.

పశ్చిమబెంగాల్ వాసి మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మం వైద్యవిభాగం: పశ్చిమబెంగాల్ మిద్నాపూర్ జిల్లా నయాగ్రామ్ గ్రామానికి చెందిన అజయ్(27) స్వగ్రామం నుండి హైదరాబాద్‌లో పనుల కోసం వెళ్తూ రైలు నుండి జారిపడి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చగా, కుటుంబీకులు ఇక్కడకు వచ్చారు. అయితే, పశ్చిమ బెంగాల్‌కు మృతదేహాన్ని తీసుకెళ్లే స్థోమత లేదని చెప్పడంతో రైల్వే పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన అజయ్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల దేవేందర్, బద్ద యోగానంద్ కుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వే స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు తెలుస్తుండగా, ఆయనను యాచకుడిగా భావిస్తున్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించి, కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్సై పి.భాస్కర్ రావు తెలిపారు.

అక్కడ ఎలా ఉంది ?!

- ఎన్నికలపై ఎన్‌ఆర్‌ఐల ఆరా
- ప్రచార శైలి, బలాబలాలపై ఆసక్తి



తెలంగాణ ఏర్పడ్డాక ఎవరు గెలుస్తారోనని దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు వారు ఆసక్తి కనబరిచారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు హోరాహోరీగా తలపడుతుండడం.. కొన్నిచోట్ల ఇతర పార్టీల అభ్యర్థులు కూడా దీటైన పోటీ ఇస్తుండడంతో ఎన్‌ఆర్‌ఐలు ఇక్కడి తమ బంధువులు, స్నేహితులకు తరచుగా ఫోన్ చేస్తున్నారు. అభ్యర్థి ఎవరు, ప్రచారం ఎలా జరుగుతోంది, బలాబలాలు ఎలా ఉన్నాయి.. విజయం ఎవరి వైపు ఉందనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా సుజాతనగర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఇతర దేశాల్లో స్థిరపడిన పలువురితో మాట్లాడగా వారు తమ అభిప్రాయాలు వెల్లడించారు. – సుజాతనగర్

ఎవరు గెలుస్తారోనని ఆసక్తి



సుజాతనగర్‌కు చెందిన చెందిన నేను వర్జీనియాలో ఉంటున్నా. పుట్టి, పెరిగిన ప్రాంతం కావడంతో ప్రతీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే అంశంపై ఆసక్తి ఉంటుంది. అందుకే మీడియాను ఫాలో అవుతూనే స్నేహితులకు తరచూ ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటున్నా.

– మల్లెల అనూష, వర్జీనియా

ప్రతీ ఎన్నికనూ పరిశీలిస్తాం



సుజాతనగర్‌కు చెందిన నేను ప్రతీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల శైలిని నిశితంగా పరిశీలిస్తా. అమ్మానాన్నల ద్వారా ఎవరు గెలుస్తారు, ఏ ప్రభుత్వం ఏర్పడితే బాగుంటుందనేది తెలుసుకుంటా. విజయావకాశాలు ఎటు ఉన్నాయో స్నేహితులతో చర్చిస్తా.

–పోటు ఫణిభూషణ్, అమెరికా

ఎన్నికలపైనే చర్చ



ఈసారి ఎన్నికలపై అంతటా ఆసక్తి ఉంది. ప్రధానంగా మూడు పార్టీలు విజయం కోసం పోటీ పడుతుండటంతో, ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపైనే మా దగ్గర కూడా చర్చ జరుగుతోంది. కొత్తగూడెంలో ఎవరు గెలుస్తారనే ఆసక్తి నెలకొంది.

–నర్రా సాయికిరణ్, ఆస్ట్రేలియా

ఓటుహక్కు వినియోగించుకోవాలి



అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి. తెలంగాణలో ఎన్నికల సంబంధించిన అంశాలను ప్రతిరోజూ టీవీ ద్వారా తెలుసుకుంటున్నా. కొత్తగూడెంలో ఏ పార్టీ గెలుస్తుంది, ప్రచారం ఎలా జరుగుతుందో కుటుంబీకులద్వారా తెలుసుకుంటున్నా.

–చింతలపూడి కార్తీక్, కెనడా

ప్రజల ఆశీస్సులతో నా విజయం ఖాయం

- అభివృద్ధి కళ్ల ముందే ఉంది...
- సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య


మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: పదిహేనేళ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్న తాను చేపట్టిన అభివృద్ధి పనులు కళ్ల ముందే కనిపిస్తున్నందున అందరి ఆశీస్సులతో తాను మరోమారు విజయం సాధించడం ఖాయమని సత్తుపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచార పర్వంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారని.. ప్రత్యర్థులు కుట్రలు, కుతంత్రాలతో సోషల్ మీడియాలో ప్రచారం చేసినా ప్రజల ఆశీస్సులతో తన విజయం ఖాయమైందన్నారు. సత్తుపల్లిని అభివృద్ధి చేస్తూనే వేధింపులు లేని స్వచ్ఛమైన పాలన అందించానని తెలిపారు. ప్రత్యర్థులకు సైతం సంక్షేమ పథకాలు ఇవ్వడంలో వివక్షత చూపించలేదని, అధికార దర్పం ప్రదర్శించలేదన్నారు. రాజకీయకక్షలు, చందాల సంస్కృతి రూపుమాపానని తెలిపారు. రూ.వెయ్యి కోట్ల విలువైన పనులు కాగితాలపై కాకుండా అభివృద్ధి రూపంలో కనిపిస్తున్నాయని, షాదీఖానా, క్రిస్టియన్ కమ్యూనిటీ భవనం, చాకలి ఐలమ్మ, అంబేద్కర్ ఆడిటోరియం, బీఎస్సీ నర్సింగ్ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాలలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈమేరకు ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మరోమారు తనను గెలిపించాలని సండ్ర వెంకటవీరయ్య కోరారు.

విజన్‌తో పనిచేస్తా

సత్తుపల్లి జిల్లా ఏర్పాటుతో పాటు ఐటీ హబ్, ఫుడ్ పార్క్ అభివృద్ధి, కల్లూరును మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ, సత్తుపల్లి నుంచి గంగారం, పెనుబల్లి, వేంసూరు విభజించి కొత్త మండలం, కల్లూరులో మహిళా డిగ్రీ కళాశాల, తల్లాడలో జూనియర్ కళాశాల, ఎంపీ బండి పార్థసారధిరెడ్డి సహకారంతో ఎస్‌బీఎస్ జూనియర్ కళాశాల నిర్మాణం, కేన్సర్ స్క్రీనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కొత్తూరు ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావుతో పాటు మట్టా ప్రసాద్, చింతనిప్పు కృష్ణచైతన్య, ఎస్‌కే.రఫీ, యాగంటి శ్రీనివాసరావు, యుధిష్టర్, ఎస్‌కే.వలీ, అవినాష్, పంతంగి వెంకటేశ్వరరావు, మిద్దె శ్రీను, పాలకుర్తి రాజు, కనకయ్య పాల్గొన్నారు.

నీతి, నిజాయితీగా పరిపాలించిన ఘనత సీపీఎందే


ర్యాలీలో పాల్గొన్న సీపీఎం అభ్యర్థి శ్రీకాంత్, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో నీతి, నిజాయితీగా పరిపాలించిన ఘనత సీపీఎందేనని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్ గెలుపును కాంక్షిస్తూ మంగళవారం నగరంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పోరాటాల్లో పాల్గొని, అనేక సమస్యల పరిష్కారానికి శ్రీకాంత్ పాటుపడ్డాడని తెలిపారు. కార్మికుల సమస్యలపై పోరాడి, వారి హక్కుల కోసం పని చేసిన శ్రీకాంత్‌కు వేసే ఏ ఓటు దుర్వినియోగం కాదని చెప్పారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ 35 ఏళ్లుగా ప్రజల మధ్యలో ఉంటూ పోరాటాల్లో భాగస్వామ్యమైన తనను గెలిపించాలని కోరారు. నాయకులు వై.విక్రమ్, అఫ్రోజ్ సమీనా, యర్రా గోపి, యల్లంపల్లి వెంకట్రావు, యర్రా శ్రీనివాసరావు, ఎం.ఏ.జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, బండారు రమేష్, తుమ్మ విష్ణు, నందిపాటి మనోహర్, డి.తిరుపతిరావు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య యాత్ర ముగింపు


కలెక్టర్ గౌతమ్‌తో సుధాకర్

కల్లూరు రూరల్: కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన దంతాల సుధాకర్ ఓటర్లలో చైతన్యం కల్పించేలా చేపట్టిన బైక్ యాత్ర మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఖమ్మం చేరుకున్న ఆయను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అభినందించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా పది రోజుల పాటు జిల్లాలో యాత్ర చేపట్టానని సుధాకర్ తెలిపారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయం..

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న సీపీఐ నేత నారాయణ, పక్కన తుమ్మల తదితరులు

ఖమ్మంఅర్బన్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తోడు దొంగలని ప్రజలు గుర్తించిన నేపథ్యాన ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఖమ్మంలోని పలు డివిజన్లతో పాటు రఘునాథపాలెం మండలంలో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి మంగళవారం జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి కోసం పాటు పడే తుమ్మల నాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. కేసీఆర్ ఖజానా నింపుకుని కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని.. దీంతో బీజేపీని ఆశ్రయించి ఇబ్బంది లేకుండా చేసుకుంటున్నారని ఆరోపించారు. కాగా, బీఆర్‌ఎస్ పాలనలో ఏ వర్గానికి న్యాయం జరగని నేపథ్యాన కాంగ్రెస్, మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని నారాయణ కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు మానుకొండ రాధాకిషోర్, లకావత్ సైదులు, మలీదు జగన్, మలీదు వెంకటేశ్వర్లు, నల్లమల వెంకటేశ్వర్లు, చోటా బాబా, బాషా, భూక్యా గౌరి, రేముళ్ల రమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

‘బీసీ సంఘాల మద్దతు కాంగ్రెస్‌కే’


అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తున్నట్లు బీసీ సంఘాల నాయకులు వెల్లడించారు. మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని మంగళవారం నిర్వహించగా, ఖమ్మంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదుటగల పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ బీసీ సంఘాల నాయకులు డాక్టర్ కేవీ.కృష్ణారావు, నారాయణవరపు శ్రీనివాస్, బత్తిని మధుగౌడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు తగ్గించడమే కాక దళితబంధు మాదిరి రూ.10లక్షలు కాకుండా కేవలం రూ.లక్ష మాత్రమే ఇచ్చిన నేపథ్యాన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. నాయకులు మోడేపల్లి కృష్ణమాచారి, విజయ్‌కుమార్, బచ్చల పద్మాచారి, పుల్లారావు, సతీష్‌కుమార్, వీరన్న, నవీన్, వరలక్ష్మి, రెహమాన్, మస్తాన్, శ్రీనివాస్‌నాయక్, రాజేందర్‌నాయక్, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్, ప్రణయ్, గోపి, నర్సింహారావు, భూషణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో..

ఖమ్మంవన్‌టౌన్: పూలే వర్ధంతిని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌తో పాటు నాయకులు కొత్తా సీతారాములు, తాళ్లూరి హన్మంతరావు, సయ్యద్ గౌస్, గజ్జెల వెంకన్న, ఏలూరి రవికుమార్, సిరంశెట్టి వేణు, షేక్ వసీం, సయ్యద్ మహమూద్, వీహెచ్.రావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా మద్యం సీజ్

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు చేస్తున్న తనిఖీల్లో భారీగా మద్యం సీసాలను పోలీసులు సీజ్ చేశారు. దమ్మపేట మండలం దురదపాడులో మంగళవారం ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ చేసిన 695 క్వార్టర్ సీసాలు లభించాయి. వీటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చేశారు.

గీతకార్మికుల వినూత్న ప్రచారం


తాటిచెట్టుపై జెండాలతో గీతకార్మికులు

పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని పాతర్లపాడు గ్రామంలో గీత కార్మికులు మంగళవారం వినూత్న ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు జడల నగేష్‌గౌడ్ ఆధ్వర్యాన గ్రామంలో ర్యాలీ నిర్వహించాక కాంగ్రెస్ జెండాలతో తాటిచెట్టుపైకి ఎక్కి ప్రదర్శించారు. నాయకులు జడల రమేష్‌గౌడ్ నరాటి శంకర్, మద్దెల యాకయ్య, మల్లారపు సురేందర్, గమిని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

– తిరుమలాయపాలెం

భద్రత కట్టుదిట్టం..

- సరిహద్దుల్లో భారీగా మోహరించిన పోలీసు యంత్రాంగం
- అటవీ ప్రాంతాల్లో ముమ్మరంగా కూంబింగ్ ఆపరేషన్


చర్ల నుంచి సరిహద్దు గ్రామాలకు తరలివెళ్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

చర్ల: తెలంగాణలో జరుగుతున్న శాసనసభ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన మావోయిస్టులు ఎలాంటి విధ్వంసాలకు పాల్పడకుండా ఉండేలా సరిహద్దులో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. రెండు రోజులుగా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాలకు చేరుకుంటున్న బలగాలు కూంబింగ్ చేపట్టాయి. సరిహద్దులో ఉన్న పూసుగుప్ప, వద్దిపేట, చెన్నాపురం, చెలిమెల, తిప్పాపురం, తోగ్గూడెం సీఆర్‌పీఎఫ్ క్యాంపులకు అదనపు బలగాలను తరలించి భద్రతను కట్టుదిట్టం చేశారు. చర్ల మండల సరిహద్దు గ్రామాలైన కుర్నపల్లి, బోదనెల్లి, కొండెవాయి, పులిగుండాల, ఎర్రంపాడు, చెన్నాపురం, బత్తినపల్లి, తిప్పాపురం, ఉంజుపల్లి, వద్దిపేట, పూసుగుప్ప గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, కోబ్రా, ఎస్‌టీఎఫ్ బలగాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మండలం నుంచి సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంత గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులలో స్పెషల్ పార్టీ పోలీసులు వచ్చి పోయే వారిని నిశితంగా తనిఖీ చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గ్రామాలకు చెందిన వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

బస్సులన్నీ కిటకిట!

- స్వస్థలాలకు వస్తున్న ఓటర్లు
- అదనపు బస్సులు ఏర్పాటుచేసిన అధికారులు

సత్తుపల్లిటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో వ్యాపార, ఉద్యోగాల రీత్యా ఉంటున్న వారు స్వస్థలాలకు వస్తున్నారు. పలువురు ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవడంతో అన్ని బస్సుల్లో సీట్లు నిండిపోయాయి. ఖమ్మం, సత్తుపల్లి, మధిర తదితర ప్రాంతాలకు బుధవారం చేరుకునే రెగ్యులర్ బస్ సర్వీసుల సీట్లన్నీ ముందే రిజర్వేషన్ అయ్యాయని అధికారులు చెబుతున్నారు. రోజువారీగా సత్తుల్లి డిపోకు చెందిన తొమ్మిది సూపర్ లగ్జరీ బస్సులు హైదరాబాద్ నుండి వస్తాయి. ఈ బస్సుల్లో సీట్లు లేకపోవడంతో అధికారులు అదనంగా మంగళవారం ఐదు బస్సులు, బుధవారం 11 బస్సులు ఏర్పాటుచేశారు.

రాజకీయ పార్టీల దృష్టి..

ఉమ్మడి జిల్లాకు వేలాది మంది విద్యా, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉండడంతో వారిని పోలింగ్ రోజున స్వస్థలాలకు రప్పించడంపై రాజకీయ పార్టీల నాయకులు దృష్టి సారించారు. రానుపోను చార్జీలు చెల్లించడమేకాక అదనపు నజరానా ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఓటు వేయొచ్చు, కుటుంబంతో గడపొచ్చు అనే ఆలోచనతో ఓటర్లంతా ఇళ్లకు బయలుదేరగా.. ఆర్టీసీ బస్సులు, రైళ్లు బుధవారం కిటకిటలాడనున్నాయి.